అభివృద్ధి మేకపాటి కుటుంబానికే సాధ్యం

- సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి
- ఉదయగిరి విజయ సంకల్పయాత్రకు అపూర్వ స్పందన



ప్రజలకు అభివాదం చేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: ఉదయగిరి ప్రాంత అభివృద్ధి మేకపాటి సోదరులకే సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం ఉదయగిరిలో విజయ సంకల్పయాత్ర నిర్వహించారు. ఆయన రంగనాయకుల స్వామి ఆలయ సమీపం నుంచి పంచాయతీ బస్టాండ్ వరకు నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ గతంలో తన సోదరుడు మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఉదయగిరిలో విద్యాభివృద్ధికి ఎన్నో పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేశారన్నారు. ఈ ప్రాంతంలో తమ కుటుంబం వల్లనే అభివృద్ధి జరిగిందని, ఈ విషయాన్ని నియోజకవర్గ ప్రజలు గమనించాలన్నారు. తనను రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఉదయగిరిని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఉదయగిరి ముస్లింలకు అవసరమైన షాదీ మంజిల్‌ను తన హయాంలోనే ఏర్పాటు చేస్తానన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు ఇంటికే అందుతున్నాయన్నారు. గ్రామాల్లో జగనన్న పాలనలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని మాట్లాడే పచ్చ పార్టీ నేతలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు కనిపిస్తున్నాయన్నారు. చంద్రబాబు పద్నాలుగేళ్లు సీఎంగా చేసినా రాష్ట్రంలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ప్రజలు చంద్రబాబు పాలనలో జరిగిన అభివృద్ధిని, జగన్ పాలనలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ప్రజలకు మోసపూరిత మాటలు చెప్పి నమ్మించేందుకు పగటి వేషగాళ్ల రూపంలో టీడీపీ, జనసేన నాయకులు ప్రజల వద్దకు వస్తుంటారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. టీడీపీ నాయకులకు ఎన్నికల సమయంలోనే ఓటర్లు గుర్తుకొస్తుంటారన్నారు. త్వరలో జరిగే ఎన్నికలు ఎంతో కీలకమైనవని, అందరూ కలిసి కట్టుగా పనిచేసి మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని, ఉదయగిరి ఎమ్మెల్యేగా తనను గెలిపించుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు జగనన్న పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించాలన్నారు. విద్య, వైద్య రంగాలకు జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తూ ప్రజామన్ననలు పొందుతున్నారన్నారు. మార్చి 3న బాపట్ల జిల్లా మేదరమెట్లలో జరిగే 'సిద్ధం' మహాసభను విజయవంతం చేయాలన్నారు. ఈ సభకు ఉదయగిరి నియోజకవర్గం నుంచి 12 వేల మంది తరలి వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు ఓబుల్‌రెడ్డి, డి.వాసుదేవరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ షేక్ అలీఅహ్మద్, ఉపసర్పంచ్ షేక్ ముర్తుజాహుస్సేన్, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మేకపాటి అభినవ్‌రెడ్డి, గడియాల్పి ఎస్దాని, అక్కి భాస్కర్‌రెడ్డి, మూలె సుబ్బారెడ్డి, ఎంప సలీం, ఎంప రియాజ్, ఉప్పుటూరి శ్రీనివాసులు, కల్లూరి రమణారెడ్డి, అక్కుల్‌రెడ్డి, ఎస్దాని, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

పేట్రేగిపోతున్న సైబర్ నేరగాళ్లు

- ఒక్క కావలి పట్టణంలోనే ఏడాదిలో 200 మందికిపైగా బాధితులు
- లక్కీడ్రాలతో పాటు వివిధ రకాల మోసాలు

సైబర్ నేరాల సంఖ్య గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగింది. గతంలో నగరాలు, పట్టణాలను ఎక్కువగా టార్గెట్ చేసుకున్న ముఠాలు ప్రస్తుతం గ్రామీణులను, గృహిణులను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ సంస్థల్లో నియామకాలు నిలిచిపోవడం, ఉద్యోగాల్లో భారీగా కోతలు విధిస్తుండటంతో పార్ట్‌టైం ఉద్యోగాలు, బ్యాక్ డోర్‌లో నియామకాలంటూ యువతను కూడా సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారు.

కావలి: కావలి వంటి చిన్న పట్టణంలో ఏడాదిలో 200 పైచిలుకు సైబర్ మోసాలకు సంబంధించి కేసులు నమోదయ్యాయి. డేటా ఉల్లంఘనలు, రుణాలు అందించే సంస్థల నుంచి థర్డ్ పార్టీ సంస్థల సేకరిస్తున్న డేటా దుర్వినియోగం కావడంతో పాటు ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ టూల్స్ ద్వారా, సోషల్ మీడియా ద్వారా సేకరించే డేటానే సైబర్ నేరస్తులు మోసాలు చేసేందుకు వినియోగిస్తుండడం గమనార్హం. స్మార్ట్ ఫోన్ వినియోగదారులు, యువత, గృహిణులు తెలిసీ తెలియక ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్న ఫొటోలు, ఇతర వివరాల ఆధారంగానే సైబర్ నేరస్తులు సులభంగా మోసాలకు పాల్పడుతున్నట్లు సైబర్ నిపుణులు చెబుతున్నారు.

ఫోన్ నంబర్ తెలిస్తే చాలు

ఒక ఫోన్ నంబర్ తెలిస్తే చాలు ఆ వ్యక్తి సమస్త సమాచారాన్ని సైబర్ నేరస్తులు సులభంగా, పైసా ఖర్చు లేకుండానే ఓపెన్ సోర్స్ టూల్స్ ద్వారా తెలుసుకోగలరు. ఉదాహరణకు ఆ నంబర్ ఎవరి పేరుపైన ఉంది, ఏ ఫోన్ ఉపయోగిస్తుంది, ఈ–మెయిల్ ఐడీ, ఆర్థిక లావాదేవీల కోసం ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి యాప్స్, ఫేస్‌బుక్, టెలిగ్రాం, వాట్సాప్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలకు సంబంధించి ఖాతాలు ఉన్నాయా లేదా? ఈ నంబర్ లేదా ఈ–మెయిల్ ఐడీని ఇంటర్నెట్‌లో ఎక్కడైనా ఉపయోగించి ఉన్నారా అనే అన్నీ అంశాలు సేకరిస్తారు. వీటి ఆధారంగా ఫోన్ చేసి జాబ్ ఆఫర్ ఉందనో, పార్ట్‌టైం ఉద్యోగం అనో, వ్యాపార అవకాశాలు, క్రిప్టో కరెన్సీ ద్వారా లక్షలు సంపాదించవచ్చనో ఎరవేస్తున్నారు. ఫోన్ చేసిన వాళ్లు పేరు, ఇతర వివరాలన్నీ నమ్మకంగా చెబుతుండటంతో అమాయకులు సులభంగా మోసపోతున్నారు.



డేటా ఎలా సేకరిస్తారు అంటే..

సైబర్ నేరస్తులు చాలా మార్గాల్లో ప్రజల డేటా, ఫోన్ నంబర్లు సేకరిస్తారు. డేటా స్క్రాపింగ్ అనే టెక్నాలజీ ద్వారా డేటా బ్రోకర్లు అందించే డేటాతో పాటు ప్రైవేట్ సంస్థల్లో రుణాల కోసం అందించే దరఖాస్తులు, షాపింగ్ మాల్స్‌లో కూపన్లు, లక్కీ డ్రాల కోసం ఇచ్చే ఫోన్ నంబర్లు, సోషల్ మీడియాలో పెట్టే పోస్టులు, జాబ్ పోర్టల్స్‌లో యువత పెట్టే రెజ్యూమ్‌లు, యూట్యూబ్, ఫేస్‌బుక్‌ల్లో బిజినెస్ వీడియోల కింద కామెంట్ సెక్షన్‌లో యూజర్లు పోస్టు చేసే ఫోన్ నంబర్లను ప్రత్యేక పద్ధతుల్లో సైబర్ నేరస్తులు సేకరిస్తారు. వీటి ఆధారంగా యూజర్ ప్రొఫైల్స్ తయారు చేస్తారు. ఇందు కోసం సొంతంగా తయారు చేయించుకున్న సాఫ్ట్‌వేర్‌లు, మైక్రోసాఫ్ట్ ఎక్సెల్ షీట్‌లు వినియోగిస్తున్నట్లు సైబర్ నిపుణులు చెబుతున్నారు.

స్వీయ జాగ్రత్తలతోనే రక్షణ

సోషల్ మీడియాలో పెట్టే పోస్టుల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు చెబుతున్న సమయంలో అప్రమత్తంగా వ్యవహరించడం, స్వీయ జాగ్రత్తలు పాటించడం ద్వారానే సైబర్ మోసాలకు చెక్ పెట్టడం సాధ్యమవుతుంది. ఉదాహరణకు విద్యార్థులు ఉద్యోగాల కోసం వివిధ జాబ్ పోర్టల్స్‌లో బయోడేటాను అప్‌లోడ్ చేస్తుంటారు. వీటిని సేకరించిన సైబర్ నేరస్తులు ఉద్యోగావకాశాల పేరుతో ఆన్‌లైన్‌లోనే ఫేక్ ఇంటర్వ్యూలు నిర్వహించి సెక్యూరిటీ డిపాజిట్లు, సర్టిఫికెట్ల వేరిఫికేషన్ పేరుతో అందినకాడికి దండుకుంటున్నారు. స్వయం ఉపాధి అవకాశాలకు సంబంధించిన వీడియోలు, గ్రూపుల్లో కొత్తగా చేరే వ్యక్తులను గుర్తించి వారిని సులభంగా ట్రాప్ చేస్తుంటారు. ఫ్రాంచైజీలు, వర్క్ ఫ్రం హోం, డేటా ఎంట్రీ వర్క్స్, వీడియోలకు లైకులు కొట్టడం వంటి అవకాశాల పేరుతో అందినకాడికి దండుకుంటున్నారు. ప్లేస్టోర్ నుంచి తప్ప బయట నుంచి వచ్చే ఎటువంటి యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకోకపోవడం, ఓటీపీలు ఎట్టి పరిస్థితుల్లో కూడా బయటవాళ్లతో షేర్ చేసుకోకపోవడం, అనుమానం వస్తే పోలీసులను సంప్రదించడం వంటి జాగ్రత్తలతోనే మోసాల నుంచి బయటపడవచ్చు.

ప్రత్యేక పంచాయతీలతోనే దళితవాడల అభివృద్ధి

- ఏఐఎం వ్యవస్థాపకుడు, విశ్రాంత ఐపీఎస్ పీవీ సునీల్‌కుమార్



మాట్లాడుతున్న ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్

ఆత్మకూరు: భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చొరవతోనే దేశంలో దళితులను గుర్తిస్తున్నారని, ఈ క్రమంలో దళితవాడలు అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక పంచాయతీలుగా కేటాయించాలని అంబేడ్కర్ ఇండియా మిషన్ వ్యవస్థాపకులు, విశ్రాంత ఐపీఎస్ పీవీ సునీల్ కుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఆవరణలో ఆదివారం రాత్రి ఏఐఎం ఆత్మకూరు శాఖ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా కేటాయించాలనే నినాదంతో సంకల్ప సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గత దశాబ్దకాలంగా ఈ సంకల్పం నెరవేరేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అది సాధించేంత వరకు ప్రతి దళితుడు కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం ముమ్మర ప్రచారం చేసేందుకు పోరాటానికి యువత సిద్ధపడాలన్నారు. హక్కుల కోసం, మౌలిక వసతుల కోసం పోరాడడం తప్పేమికాదన్నారు. ప్రత్యేక పంచాయతీల సాధనకు కలిసికట్టుగా కృషి చేస్తామని, అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పీవీ సునీల్‌కుమార్‌ను ఏఐఎం కార్యవర్గ సభ్యులు నందా ఓబులేసు, రమేష్, పట్టెడ మురళీ తదితరుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల ఏఐఎం సభ్యులు పట్టెడ మురళీ, పెంచలయ్య, వెంకట్, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చోడికి పచ్చకండువా కప్పి బంధుత్వాలు అంటకడతారా?



మాట్లాడుతున్న నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి

కావలి: దారిన పోయే పిచ్చోడికి పచ్చ కండువా కప్పి బంధుత్వాలను అంటకడుతున్న టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డికి సిగ్గులేదంటూ కావలి 25వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి మండిపడ్డారు. 25వ వార్డుకి చెందిన వింతా వెంకటేశ్వర్లురెడ్డి అలియాస్ పిచ్చోడికి పచ్చ కండువా కప్పి అతను నా బావమరిదిగా చిత్రీకరించడం వెనుక మీ దురుద్దేశం అర్థమవుతుందన్నారు. నా బావమరిది పేరు వాసిపల్లి రవీంద్రారెడ్డి, అతను పీహెచ్‌డీ కాలేజీలో లెక్చరర్, వైఎస్సార్ అభిమాని. అయితే వింతా వెంకటేశ్వరరెడ్డి నా బావమరిది అని టీడీపీ వాళ్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తప్పుడు రాతలు రాసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 25వ వార్డు వైఎస్సార్‌సీపీ కంచుకోట అని 2014, 2019లో భారీ మెజార్టీ వచ్చిందని, 2024 ఎన్నికల్లో కూడా ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి భారీ మెజార్టీ తీసుకువచ్చి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామన్నారు.

సాంబశివ ట్రస్ట్ మరిన్ని ఉచిత సేవలు

- అందుబాటులోకి 4 ఫ్రీజర్లు శవయాత్ర రథం



కైలాస రథ యాత్ర వాహనం ఉచితంగా అందుబాటులోకి తెచ్చినట్లు వ్యాన్ వద్దనే మాట్లాడుతున్న నిర్వాహకులు

ఆత్మకూరు: పట్టణానికి చెందిన శ్రీసాంబ శివ చారిటబుల్ ట్రస్ట్ ప్రజలకు మరో రెండు సేవా కార్యక్రమాలు అందించనున్నట్లు నిర్వాహకులు కంచి పరమేశ్వర రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ట్రస్ట్ కార్యాలయంలో కంచి పరమేశ్వర రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కుటుంబాల్లో ఎవరైనా మృతి చెందినప్పుడు దూరపు బంధువులు వచ్చేదాకా ఆయా మృతదేహాలను భద్రపరచడం, పేదలకు, మధ్య తరగతి వారికి ఆర్థిక భారం అవుతోంది. దీనికి తోడు ఒక్కొక్కసారి అలాంటి సౌకర్యం సైతం అందుబాటులోకి రాని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఆత్మకూరు పట్టణంతో పాటు ఏఎస్‌పేట మండల ప్రజలకు నాలుగు ఫ్రీజర్లు (మృతదేహం భద్రపరిచే ఐస్ బాక్స్‌లు), వీటితో పాటు శవయాత్రకు కైలాసరథం ఏర్పాటు చేసినట్లు పరమేశ్వరరెడ్డి వివరించారు. అవసరమైన వారికి వాటిని ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఒక ఫ్రీజర్‌ను ఏఎస్‌పేట మండలానికి అందజేస్తుండగా, మరో మూడు ఫ్రీజర్లు ఆత్మకూరు పట్టణంలో హిందువులకు 2, ముస్లిం మైనార్టీలకు 1 అందుబాటులో ఉంచినట్లు ఆయన వివరించారు. అవసరమైన వారు 95024 50174, 90308 08009, 94408 47441 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఫ్రీజర్లను తీసుకెళ్లి తిరిగి కార్యాలయానికి అప్పగించే బాధ్యత ఉపయోగించుకునే వారిదేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కేవీ శేషారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, కుడుముల సుధాకర్ రెడ్డి, సలహాదారులు నారాయణరావు, గోవిందురెడ్డి, చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీతాలమ్మ, పోతురాజు శిలల జీర్ణోద్ధరణ



సీతాలమ్మ, పోతురాజు శిలలను ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

సంగం: మండలంలోని తరుణవాయిలో సీతాలమ్మ, పోతురాజు శిలల జీర్ణోద్ధరణ పూజలను గ్రామస్తులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. మండపం వద్ద అర్చకులు గణపతి పూజ, పుణ్యాహవచనం, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అనంతరం సీతాలమ్మ, పోతురాజు శిలలను బయటకు తీసి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పాల్గొని సీతాలమ్మ, పోతురాజు శిలలను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చెక్కు అందజేస్తున్న కంచి పరమేశ్వర రెడ్డి, తదితరులు

ఆత్మకూరు: పట్టణంలో ఇటీవల మృతి చెందిన ఐదు కుటుంబాలకు ఉత్తరక్రియల ఖర్చుల నిమిత్తం శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. 2వ వార్డు వెంకట్రావుపల్లిలో ఖాదరమ్మ, 15వ వార్డులో అల్తాఫ్, 16వ వార్డులో మునీర్‌బాషా, 22వ వార్డు జ్యోతినగర్‌కు చెందిన వెంకటరత్నం, 5వలో ఖాజాపీర్ పలు కారణాలతో ఇటీవల మృతి చెందారు. దీంతో ట్రస్ట్ అధ్యక్షుడు కంచి పరమేశ్వరరెడ్డి సభ్యులతో కలిసి ఆదివారం ఆయా కుటుంబాలను పరామర్శించి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా వార్డుల కౌన్సిలర్లు శివకోటారెడ్డి, మహబూబ్‌బాషా, వార్డు ఇన్‌చార్జి రహీం, మెప్మా టీఎల్ఎఫ్ ఉపాధ్యక్షురాలు ప్రమీల, మెప్మా ఆర్పీలు శిరీషా, సుజాత, ఆఫ్రీన్, ఉపాధ్యాయుడు మురళీ, ట్రస్ట్ సభ్యుడు ఆర్ ప్రసాద్‌రెడ్డి, మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

28న మండల సమావేశం

అల్లూరు: ఈ నెల 28న మండల సాధారణ సర్వసభ సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. తాగునీరు, పారిశుద్ధ్యం, గ్రామీణ రోడ్లు, వైద్యారోగ్య శాఖలకు సంబంధించి అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

గ్రూప్- 2 పరీక్షకు మహిళల క్యూ



కావలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆదివారం గ్రూప్–2 పరీక్ష నిర్వహించింది. బోగోలు మండలం కడనూతలలోని ఆరెస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి అత్యధిక సంఖ్యలో మహిళలు గ్రూప్–2 పరీక్షలు రాయడానికి హాజరయ్యారు. పటిష్ట భద్రత, పర్యవేక్షణలో పరీక్షలకు ఏర్పాట్లు చేశారు. నిర్వాహకులు అభ్యర్థుల హాల్ టికెట్లు పరిశీలించి పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించారు. దీంతో మహిళలు క్యూలైన్‌లో నిలబడ్డారు.

నేడు మేకపాటి విజయీభవ యాత్ర

ఆత్మకూరురూరల్: మండలంలోని పమిడిపాడు, నబ్బీనగరం, మురగల్ల గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి విజయీభవ యాత్ర నిర్వహిస్తారని మేకపాటి కార్యాలయ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాలకు పార్టీ మండల అధ్యక్షుడు, జేసీఎస్ కన్వీనర్లు, ఎంపీపీ, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నామినేటెడ్ పదవుల చైర్మన్లు, ప్రజలు తప్పక హాజరు కావాలని కోరారు.

నేడు పోలంపాడులో విజయసంకల్పయాత్ర

కలిగిరి: మండలంలోని పోలంపాడు, ఏపినాపి, రావులకొల్లు పంచాయతీల్లో సోమవారం ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజయ సంకల్పయాత్ర నిర్వహిస్తారని జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ కాటం రవీంద్రారెడ్డి ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.


కొత్తపాళెంలో..

జలదంకి: మండలంలోని కొత్తపాళెంలో సోమవారం మధ్యాహ్నం 1 గంటకు విజయ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి ఆదివారం తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

'ఆధారాలు లేకుండా ఓట్లను చేర్చారు'

కొండాపురం: ఎలాంటి ఆధారాలు లేకుండా 75 ఓట్లను టీడీపీ నాయకులు చేర్చారని మర్రిగుంట సర్పంచ్ దార్ల గోపి ఆరోపించారు. ఆదివారం ఆయన కొండాపురంలో మాట్లాడుతూ 2020లో గ్రామంలో లేకుండా నెల్లూరు, చెన్నైలో ఉన్న 150 మంది ఓటర్లను తొలగించేందుకు అధికారులను కోరినట్లు తెలిపారు. అప్పటి ఎన్నికల కమిషన్ రెవెన్యూ అధికారులు గ్రామంలో విచారించి లేని వారిని తొలగించాలని ఆదేశించారు. గ్రామంలో విచారణ చేపట్టిన అధికారులు 95 మంది ఓటర్లు గ్రామంలో లేనట్లు గుర్తించి తొలగించారన్నారు. ఇప్పుడు మళ్లీ ఇక్కడ పనిచేసి వెళ్లిన తహసీల్దార్ టీడీపీ నాయకుల వద్ద ముడుపులు తీసుకుని గ్రామంలో ఎలాంటి ఎలాంటి ఆధారాలు లేని 75 ఓట్లను ఆన్‌లైన్ చేశారన్నారు. దీనిపై కోర్టుకు కూడా వెళుతున్నట్లు తెలిపారు.

అలరించిన చిన్నారుల ప్రదర్శన



అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం చేస్తున్న పాఠశాల విద్యార్థి

ఆత్మకూరురూరల్: మండలంలోని వెన్నవాడ ఎంపీపీఎస్ పాఠశాల వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. 1 నుంచి 5వ తరగతి వరకు పాఠశాలలో చదివే విద్యార్థులు ఆంగ్లంలో చేసిన సంభాషణలు, ఉపన్యాసాలు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలను అలరించాయి. శ్రీకృష్ణ దేవరాయలు, అల్లూరి సీతారామరాజు, ఏకపాత్రాభినయ ఘట్టాలు, ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కలిశెట్టి రవీంద్రకుమార్, ఉపాధ్యాయురాలు జీవని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలకు ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, ఎంఈఓలు నజీర్‌బాషా, చలపతి, ప్రధానోపాధ్యాయులు మాలకొండల రావు, స్థానిక సర్పంచ్ జగన్నాథం లక్ష్మమ్మ, జెడ్పీటీసీ ప్రమీల, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు పీఎస్‌బీ శ్రీనివాసులు తదితరులు హాజరై విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ సునంద, పశువైద్యాధికారి సీహెచ్ వెంకటేశ్వర్లు రెడ్డి, గండ్లవేడు, మహిమలూరు, వెన్నవాడ, తదితర పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.